క్లుప్తంగా

సాక్షి ఫొటోగ్రాఫర్‌కు సన్మానం



సాక్షి ఫొటోగ్రాఫర్ యాకయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట : ఇటీవల ఐఅండ్‌పీఆర్ నిర్వహించిన వరల్డ్ ఫొటోగ్రఫీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రెండు అవార్డులు పొందిన సూర్యాపేట జిల్లా సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ అనమాల యాకయ్యను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (హెచ్ – 143) జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్య, సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్ గుప్తా, చంద్రశేఖర్, ఎడ్వర్డ్, జహంగీర్, శ్యాంసుందర్ రెడ్డి, శిగ సురేష్ గౌడ్, ఫణీంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



చాకలిగూడెంలో ముత్తయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం తండ్రి ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతడి మృతదేహాన్ని మంగళవారం రాత్రి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సందర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, బైరబోయిన మహారాజు, అల్వాల వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

నూతనకల్ : బూత్ స్థాయి నుంచి పార్టీని అభివృద్ధి చేయడం కోసం నాయకులు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి బూత్ నుంచి 200సభ్యత్వాలను చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్, వెంకటేశ్వర్‌రావు, మద్ది సంజీవరెడ్డి, నెల్లుట్ల వీరస్వామి, మధుసూదన్‌రెడ్డి, కప్పల హర్షవర్ధన్, జక్కుల ఉప్పలయ్య, బత్తిని లింగయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన కట్టెల రమేష్ తల్లి దేవకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో స్థానిక చైతన్యభారతి ఉన్నత పాఠశాల పదవ తరగతి 2011–12 బ్యాచ్ విద్యార్థులు తమతోటి విద్యార్థి అయిన రమేష్ కుటుంబానికి మంగళవారం రూ.16,500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నోముల నవీన్, ఎల్లంల శ్రీకాంత్, కుంభం శ్రీకాంత్, చవ్వ సురేష్, తవిటి వెంకటేష్, దావుల నవీన్, నరేష్ పాల్గొన్నారు.

డీసీపీ భాస్కర్‌కు సన్మానం

అర్వపల్లి : రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల డీసీపీగా పనిచేస్తున్న జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి గ్రామస్తుడు ఎగ్గడి భాస్కర్‌కు ఇటీవల ఐపీఎస్ హోదా దక్కింది. దీంతో మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్ జాల నర్సయ్యతోపాటు గ్రామస్తులు, స్నేహితులు అక్కడికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. పోలీస్‌శాఖలో మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో భాస్కర్ స్నేహితులు ఉన్నారు.

కోర్టు ఆర్డర్ ధిక్కరణ.. ఇద్దరి రిమాండ్

తుంగతుర్తి : కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌ను ఉల్లంఘించిన ఇద్దరిని రిమాండ్ చేసినట్లు సీఐ శ్రీనునాయక్ తెలిపారు. గతంలో తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులో ఎల్లబోయిన భిక్షం కొనుగోలు చేసిన భూమికి కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వగా.. ఆ భూమి తమదంటూ అన్నారం గ్రామానికి చెందిన గుండాల బుచ్చయ్య, అతడి భార్య గుండాల ఉప్పమ్మ, గుండాల మాధవి, షేక్ అఖిల్‌పాష భిక్షంపై దాడి చేశారు. అదే సమయంలో కూలి పనికి వచ్చిన మారగాని శ్రీను అడ్డం వెళ్లగా అతడి చేతికి గొడ్డలి తగిలి గాయమైంది. ఈ ఘటనపై ఎల్లబోయిన భిక్షం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుచ్చయ్య, ఉప్పమ్మ, మాధవి, షేక్ అఖిల్‌పాషపై కేసు నమోదయ్యిందని సీఐ తెలిపారు. ఈ క్రమంలో గుండాల బుచ్చయ్య, అతడి భార్య గుండాల ఉప్పమ్మను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి నల్లగొండ జిల్లా జైలుకు రిమాండ్ విధించారని తెలిపారు.

కొరవడిన వసతులు.. కరువైన రక్షణ

- రామన్నగూడెం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రం ఏర్పాటు
- మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం
- ప్రహరీ నిర్మించకపోవడం, కిటికీలకు తలుపులు లేకపోవడంతో వేదికకు రక్షణ కరువు



వీడియో కాన్ఫరెన్స్ కేంద్రం కొనసాగుతున్న రామన్నగూడెం శివారులోని రైతువేదిక



రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఎల్‌సీడీ

అర్వపల్లి : వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడుల సాధన, సాగులో మెళకువలు, శాస్త్రవేత్తలతో ఎప్పటికప్పుడు రైతులకు తగిన శిక్షణ ఇవ్వడం కోసం జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెంలోని రైతు వేదికను వీడియో కాన్ఫరెన్స్ కేంద్రంగా మార్చారు. అయితే దీనికి సంబంధించి రైతు వేదికలో ఎల్‌సీడీ, వీడియో కెమెరాలు, సౌండ్‌సిస్టం ఏర్పాటు చేశారు. ఈ రైతు వేదికలో ప్రతి మంగళవారం రైతులకు వీడియో కాన్ఫరెన్స్ జరుగుతోంది. రాష్ట్రంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో వివిధ పంటల సాగుపై రూపొందించిన వీడియోలను ఈ వీడియో కాన్ఫరెన్స్ కేంద్రంలో ప్రదర్శిస్తుంటారు. అలాగే శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంట సాగు, సస్యరక్షణ చర్యలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని రెండు క్లస్టర్ల ఆధ్వర్యంలో ఉన్న దాదాపు 8 వేల మంది రైతులకు ఇక్కడ శిక్షణ, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

రైతు వేదికకు రక్షణ లేకపోవడంతో..

రామన్నగూడెం గ్రామ శివారులోని హైవే వెంట పొలాల మధ్య రైతు వేదికను నిర్మించారు. అయితే ఈవేదికకు ఎలాంటి రక్షణ లేకుండా పోయింది. రోడ్డుపై వెళ్లే ఆకతాయిలు వేదికను పాడుచేస్తున్నారు. వేదికకు ప్రహరీ నిర్మించలేదు. మరుగుదొడ్లు ఏర్పాటు చేసినా అవి కూడా పనిచేయడం లేదు. వేదిక నిర్మాణంలో నాణ్యత లోపించడంతో టైల్స్, గ్రిల్స్, తలుపులు ఊడిపోతున్నాయి. కిటికీలకు తలుపులు కూడా లేవు. దీంతో ఆకతాయిలు వేదికలోకి రాళ్లను విసురుతున్నారు. ఇప్పటికైనా రైతు వేదికకు ప్రహరీ నిర్మించాలని, వసతులు కల్పించాలని, అలాగే కాపలాదారుడిని నియమించాలని పలువురు రైతులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వసతులు కల్పించాలి



రామన్నగూడెంలోని రైతు వేదికను వీడియో కాన్ఫరెన్స్ కేంద్రంగా ఏర్పాటు చేయడం సంతోషకరం. కానీ ఇక్కడ కనీస వసతులు కల్పించాలి. నిర్వహణ నిధులు లేకపోవడంతో రైతువేదికలో అనేక సమస్యలు నెలకొంటున్నాయి.

– వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం మండల నాయకుడు

ప్రహరీ నిర్మించాలి



రామన్నగూడెం రైతువేదిక గ్రామానికి దూరంగా ఉండటంతో రక్షణ లేకుండా పోయింది. ఈ రైతు వేదిక వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌గా ఏర్పాటైనందున ఇప్పటికైనా రక్షణ చర్యలు తీసుకోవాలి. మొదట వేదికకు చుట్టూ ప్రహరీ నిర్మించి, గేట్లు ఏర్పాట్లు చేయాలి.

– ఎండీ. హమీద్, రైతు

ఘనంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి సంవత్సరం నిర్వహించే పవిత్రోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అగ్నిప్రతిష్ఠ, మూల మంత్ర హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు మాట్లాడారు. స్వామివారికి సంవత్సర కాలంలో నిర్వహించే ఆరాధనలు, అర్చనలు, ఉత్సవాల్లో లోపాలు, దోషాలను తొలగించుటకై పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి వై.శ్రీనివాసరెడ్డి, అర్చకులు సంకర్షణ ఆచార్యులు, శ్రీహరిచార్యులు, ఫణి కుమార్ ఆచార్యులు, ఆండాళ్ గోష్ఠి భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సూర్యాపేట : టీజీ ఎస్‌ఆర్‌టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు మంగళవారం ఆర్టీసీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జోన్ నాయకుడు సుంకరి శ్రీనివాస్ మాట్లాడారు. టీజీఎస్ ఆర్‌టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని అన్నారు. చనిపోయిన ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు, ఉద్యోగుల పిల్లలకు రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నల్లగొండ రీజియన్ కార్యదర్శి ఎస్ఎస్ గౌడ్ మాట్లాడుతూ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సైదులు, రేసు శ్రీనివాస్‌గౌడ్, ఏకాంబరం, వెంకటయ్య, పవన్, విజయభాస్కర్, సావిత్రి, మాధవి, యల్లమ్మ, ఉమా మహేశ్వరి, రాజేశ్వరి, జరీనాబేగం , తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న గోపగాని రవికుమార్

భానుపురి : ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్ అన్నారు. మంగళవారం సూర్యాపేటలోని ధర్మభిక్షం భవన్‌లో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విద్యార్థుల హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగం సమస్యలతో సతమతమవుతుందని తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు బాణోతు అభి, మరికంటి జలాలు, చరణ్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై అవగాహన



నాగారం : ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణరెడ్డి



మద్దిరాల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న గోపయ్య

నాగారం : ఓటరు జాబితా సవరణను బీఎల్‌ఓలు పకడ్బందీగా నిర్వహించాలని నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ (ఏఎల్‌ఎంటీ) సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఓటరు జాబితా నమోదుపై బీఎల్‌ఓలకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. బీఎల్‌ఓలు గ్రామాల్లో ఇంటింటి ఓటరు సర్వేను చేపట్టి జాబితా సవరణలో ఎలాంటి తప్పులు దొర్లకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. 1–1–2025 నాటికి 18ఏళ్లు నిండే ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఇంటింటిని సందర్శించి ఓటరు పేరు, చిరునామా, ఇతర సవరణలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఎంపీఎస్‌ఓ చింతమళ్ల రమేష్, గిర్దవార్ కె.నాగరాజు, జూనియర్ అసిస్టెంట్లు మహేశ్వరి, ఆసీఫ్, రెవెన్యూ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : ఓటర్ సర్వేలో భాగంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ శిక్షణ అధికారి గోపయ్య మాట్లాడుతూ ఓటర్ల నమోదుపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. బీఎల్‌ఓలు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఆర్ఐ వహీద్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని వినతి



తుంగతుర్తిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను నియోజకవర్గ కేంద్రమైన తుంగతుర్తిలోనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు తడకమల్ల రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ కంతమయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొంకూరి మల్లేష్, బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేష్, తడకమల్ల మల్లికార్జున్, గడ్డం సోమేష్, తడకమల్ల మధు, పడమటి మధు, చింతకుంట్ల సురేష్, కడియం గోపి, బొంకూరి నాగరాజు, కొండగడుపుల శ్రీను పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఏర్పాటు చేయాలి

అర్వపల్లి : ప్రభుత్వం తుంగతుర్తి నియోజకవర్గంలో ఏర్పాటు చేయబోయే ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను జాజిరెడ్డిగూడెం మండలంలో ఏర్పాటు చేయాలని పూలే–అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు సురేందర్, నర్సింహ, వెంకన్న, వెంకటమ్మ, కృష్ణయ్య, రామకృష్ణ, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న ఎంఈఓ

ఆత్మకూరు(ఎస్) : మండల పరిధిలోని ఏనుబాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ధారాసింగ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయ, సహకారం అందించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల దేవరాజు, ఉపాధ్యాయులు భరణి కుమార్, శ్రీనివాస్, ఝాన్సీ, మహాలక్ష్మి, వెంకన్న, రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అపరిచితుల నుంచి ఫోన్లు కొనుగోలు చేయొద్దు

నాగారం : అపరిచిత వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్లను కొనుగోలు చేయవద్దని ఎస్ఐ ఐలయ్య అన్నారు. మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన గండమల్ల శోభన్‌బాబు రెండు రోజుల క్రితం సెల్‌ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే అతడి సెల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్ అప్లికేషన్‌లో నమోదు చేసి మొబైల్‌ను ట్రేస్ చేసి, మంగళవారం ఫిర్యాదుదారుడికి అప్పగించినట్లు తెలిపారు. దొరికిన మొబైల్స్, తక్కువ ధరలకు అమ్మే ఫోన్లను, అపరిచిత వ్యక్తుల మొబైల్స్‌ను కొనుగోలు చేయవద్దని సూచించారు. ఆయనతోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

మద్దిరాల : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి మంగళవారం పోలీసులు అప్పగించారు. ఎస్ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన వరిపెల్లి సంపత్ కొన్నిరోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి సెల్‌ఫోన్‌ను కనిపెట్టి బాధితుడికి అప్పజెప్పారు.

చీడపీడల నివారణతోనే అధిక దిగుబడులు



నూతనకల్ : పత్తి సాగుపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్



పెన్‌పహాడ్ : గ్రామ పటం ద్వారా అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నూతనకల్ : పంటలను ఆశించే చీడపీడలను నివారించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చని కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త ఎ. కిరణ్ తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన లయోలా అకాడమీలో వ్యవసాయ డిగ్రీ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు మంగళవారం గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన గ్రామీణ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రైతులు ఒకే రకమైన పంటను సాగు చేయడం వల్ల భూసారం తగ్గి పంటలకు చీడపీడలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. పంటమార్పిడి విధానాన్ని పాటిస్తే దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని వనరులను పటం ద్వారా చిత్రీకరించారు. రైతుల వర్గీకరణ, వ్యవసాయ దిగుబడులు, చీడ పీడల నివారణకు ఆచరిస్తున్న విధానాలను చార్ట్‌లో చిత్రీకరించి వివరించారు. అనంతరం కంది, పత్తి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జానయ్య, రాజబహదూర్ రెడ్డి, అవిలయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఎం. సురేష్, శ్రీవిష్ణు, సుధాకర్, శివ, కార్తీక్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా అకాడమీ సికింద్రాబాద్‌కి చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ విధానాలను అధ్యాయనం చేసినట్లు కేవీకే ప్రోగ్రాం అసిస్టెంట్ ఎ. నరేష్ తెలిపారు. మంగళవారం అన్నారం గ్రామంలోని రైతువేదికలో నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని వనరులను గ్రామ పటం ద్వారా చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, సందీప్, వేణుగోపాల్, భరత్, రాములు, కొమురయ్య, విద్యార్థులు ప్రభంజన్, ఉషారాణి, మహేష్, అభిలాష్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఆందోళన చెందవద్దు



తుంగతుర్తి : కొత్తగూడెం రైతువేదికలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఓ బాలకృష్ణ



వర్ధమానుకోటలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు

తుంగతుర్తి : రుణమాఫీకి సంబంధించి రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి బాలకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడెం రైతు వేదికలో రైతుల నుంచి రుణమాఫీ దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. రుణమాఫీ కానీ రైతులు ఆధార్ కార్డుతో రుణమాఫీ వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. రుణమాఫీ కాని రైతులు సమస్య పరిష్కారానికి తగు పత్రాలు జత చేసి ఏఈఓలకు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయిశ్రీజన, రైతులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

నాగారం : రుణమాఫీ కానీ రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.కృష్ణకాంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వర్ధమానుకోట రైతు వేదికలో డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వారు నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. మండలంలోని కెనరా బ్యాంక్ నందు రుణమాఫీకి సంబంధించి 367 మంది కుటుంబ నిర్ధారణ కానివారు ఉన్నట్లు తెలిపారు. నేటి నుంచి గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీఎల్‌డబ్ల్యూ యాప్‌లో రైతుల వివరాలను నమోదు చేస్తామని అన్నారు. జాబితాలోని రైతులు రైతు ధ్రువీకరణ పత్రం, కుటుంబంలోని వారి ఆధార్‌కార్డులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు. అనంతరం రైతులకు పంటల సాగు, పంటలకు వచ్చే చీడ, పీడలు, తెగుళ్ల నుంచి రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏఈఓలు శ్రీను, శ్వేత, రైతులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



అడివెంల అంగన్‌వాడీ కేంద్రంలో వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పవన్‌కుమార్

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్ అన్నారు. అడివెంల గ్రామంలో మంగళవారం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వాటిలో పిల్లల కోసం వండిన మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి ప్రజలు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సీహెచ్. ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి, ఈసీ నగేష్, హెచ్‌ఎం ఎల్.యాదమ్మ, టీఏ యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు శతకోటి కళమ్మ, సరోజ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని లాల్‌సింగ్ తండా ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు వై. నిర్మల, రమాదేవిలు ఇటీవల బదిలీపై వెళ్లారు. మంగళవారం ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గవాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరయ్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సంద్యాల వినోద్, జిల్లా ఉపాధ్యక్షుడు సైదిరెడ్డి, పీఆర్‌టీయూ సభ్యులు నవీన్‌కుమార్, శ్రీకాంత్, భగత్‌సింగ్ యూత్ అధ్యక్ష, కార్యదర్శులు లాల్‌సింగ్, చందు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల హర్షం

తుంగతుర్తి : భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడారు. గత ఆరు నెలలుగా కవితకు పట్టిన గ్రహణం నేటితో వీడిందన్నారు. కార్యక్రమంలో గోపగాని శ్రీనివాస్, తడకమళ్ల రవికుమార్, వెంకన్న, కిరణ్, సోమేష్, హరినాయక్, ఉప్పలయ్య, వెంకటేష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

నాగారం : నాగారం మండల పరిధిలోని పేరబోయినగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గండమల్ల లక్ష్మయ్య సతీమణి గండమల్ల కళమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యలమకంటి సోమన్న, కొలిపాక సాయికుమార్, పేరబోయిన నాగరాజు, కన్నెబోయిన నాగరాజు, వేణు పాల్గొన్నారు.

రాజీలేని పోరాటం చేస్తాం



జెండా ఎగురవేస్తున్న రాజేష్

చివ్వెంల : రాజకీయ పార్టీలపై రాజీలేని పోరాటాలు చేస్తామని భారత వికలాంగ హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. మంగళవారం సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దురాజ్‌పల్లి గ్రామంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఢిల్లీలో ఎర్రకోటపై, రాష్ట్రంలో గోల్కొండ కోటపై వికలాంగుడే జాతీయ జెండాను ఎగురవేసే వరకు పోరాడుతామన్నారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాల్లో వికలాంగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో వికలాంగుల భవనాలు నిర్మించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వికలాంగుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్యబాబు, గోగుల శేఖర్ రెడ్డి, జంజిరాల సుధాకర్, గునగంటి వెంకటేశ్వర్లు, కొండ సైదులు, మున్న మధు, పైడీ వీరమ్మ, యల్లయ్య, ఆరూరి బాలరాజు, ఉప్పయ్య, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న పశువైద్యాధికారి కిరణ్‌కుమార్

పెన్‌పహాడ్ : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో పాడి పశువుల లబ్ధిదారులకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. సమభావన సంఘాల సభ్యుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పాడి పశువులను అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి వెంకన్న, ఏపీఎం అజయ్‌నాయక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, కళ్యాణి, జయమ్మ పాల్గొన్నారు.